అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 27 మార్చి 2023
1

సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని తెగాపూర్, గాడ్జన్‌గాం, బోర్దా గ్రామాల్లో ఈజీఎస్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను ఆదివారం ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు. మండలంలో 65 సీసీ రోడ్లు మంజూరయ్యాయని, వీటిని త్వరలోనే పూర్తిచేయాలని ఆయన అధికారులకు ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించినట్టయితే సర్పంచ్‌లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఈ పనులు ఈ నెల 30వ తేదీ వరకు పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు ఎంపీఓ శివ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి సంఘం నాయకులు

నవతెలంగాణ-తలమడుగు



ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తలమడుగు మండల రెడ్డి సంఘం నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కేంద్రంలో మండల రెడ్డి భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే రూ.10లక్షలకు తగ్గకుండా నిధులు మంజూరు చేసి భూమిపూజ త్వరలోనే చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు అల్లూరి స్వామి రెడ్డి, కార్యదర్శి అయిండ్ల వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు రావుల నిఖిల్ రెడ్డి, జిల్లా నాయకులు కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సంఘ పెద్దలు కేశవ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

పరిహారంపై అన్నదాతల్లో ఆశలు..!

- వడగండ్ల వర్షంతో తీవ్రంగా దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వ సాయంపై సీఎం ప్రకటనతో హర్షం
- నేటి నుంచి పంట నష్టంపై అధికారుల సర్వే


వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో కన్నీరు కార్చిన అన్నదాతలకు సీఎం భరోసా ఇవ్వడంతో ఊరట చెందుతున్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.10వేల చొప్పున సాయం అందజేస్తామని చెప్పడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సాయాన్ని కేంద్రప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టం సాయం కింద తక్షణమే రూ.228కోట్లు విడుదల చేస్తామని చెప్పడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ డబ్బులు త్వరలోనే బాధిత రైతుల ఖాతాల్లో జమ కానున్నాయని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇప్పటికే పంట నష్టంపై ప్రాథమికంగా అంచనా వేసిన అధికారులు ప్రభుత్వానికి సూచనప్రాయంగా వివరాలు పంపించారు. నేటి(సోమవారం) నుంచి పూర్తిస్థాయి సర్వే చేసి ప్రభుత్వానికి పంపిస్తామని అధికారులు చెబుతున్నారు.



బోథ్ మండలంలో నేల రాలిన జొన్న పంట

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షం..అన్నదాతలకు కడగండ్లు మిగిల్చాయి. చేతికొచ్చిన పంటలు నేలవాలడంతో రైతులు తీవ్రంగా



హాజీపూర్ మండలం నాంనూర్‌లో నేల కొరిగిన మొక్క జొన్న పంట

నష్టపోయారు. జొన్న, మొక్క, మామిడి, కూరగాయల పంటలన్ని వడగండ్ల వర్షానికి నేలరాలాయి.ఇప్పటికే ఖరీఫ్‌లో సీజన్‌లో అధిక వర్షాల కారణంగా పత్తి, సోయా, కందులు తదితర పంటలన్ని దెబ్బతినడం..పంట దిగుబడి తీవ్రంగా పడిపోవడంతో పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేకపోయింది. ఈ సమయంలో రైతులకు ఎలాంటి బీమా సౌకర్యం కూడా లేకపోవడంతో నష్టపరిహారంపై ఆశలు వదులుకున్నారు. వీరితో పాటు కౌలు రైతుల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. పత్తి ఆశించిన స్థాయిలో పండకపోవడంతో భూమి కౌలు చెల్లించడంతో పాటు ఈ పంట కోసం పెట్టిన పెట్టుబడి కూడా రాలేకపోయింది. దీంతో కౌలు రైతులు అప్పులపాలై అవస్థలు పడుతున్నారు. కనీసం యాసంగిలోనైనా పంటలు పండించి ప్రయోజనం పొందుదామని ఆశించిన అన్నదాతలకు తాజా వడగండ్ల వర్షం కడగండ్లను మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల మంచురాళ్లతో కూడిన వర్షం కురవడంతో ఆ తాకిడికి జొన్న, మొక్కజొన్న, ఇతర పంటలన్ని నేలరాయిపోయాయి. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ రైతులకు బాసటగా నిలుస్తామని ప్రకటించడంతో బాధిత రైతులు ఊరట చెందుతున్నారు.

సీఎం ప్రకటనతో అన్నదాతల్లో హర్షం..!

ఇటీవల రాష్ట్రంలో కురిసిన వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటలను ముఖ్యమంత్రి కేసీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంతో నిమిత్తం లేకుండా బాధిత రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే సాయం అందిస్తుందని చెప్పారు. పంటల సర్వే చేయాలని అధికారులను ఆదేశించడంతో ఉమ్మడి జిల్లా రైతులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 2300 ఎకరాల వరకు నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేసి ప్రభుత్వానికి పంపించారు. ఇందులో ఎక్కువగా బోథ్, నేరడిగొండ మండలాల్లోనూ అధికంగా నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోనూ వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసేందుకు వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈఓ)లు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. ఏయే పంటలు నష్టం జరిగింది.. ఎన్ని ఎకరాల్లో నష్టం వాటిల్లిందో స్వయంగా పరిశీలించి వివరాలను నమోదు చేయనున్నారు. రెండు, మూడు రోజుల పాటు సర్వే చేసి నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నారు. ఇది పూర్తికాగానే పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ కానున్నాయని తెలుస్తోంది.

సర్వే చేసి ప్రభుత్వానికి పంపిస్తాం

- పుల్లయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటల వివరాలను ప్రాథమికంగా అంచనా వేశాం. జిల్లాలో జొన్న, మొక్కజొన్న పంటలు అధికంగా నష్టపోయినట్లు గుర్తించాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నేటి నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేసి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తాం.

ఈదురుగాలుల బీభత్సం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పట్టణంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు బీభత్సం సృష్టించింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు వీచడంతో పట్టణంలోని తారకరామానగర్ కాలనీలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సంబంధించిన ఐరన్ మెట్లు ఒక్కసారిగా కింద పడటంతో కాలనీకి చెందిన బషీర్ ఖాన్ ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. అలాగే కాలనీలో విద్యుత్ వైర్లు ఈదురుగాలులకు తెగిపడ్డాయి. దీంతో కొంతసేపు కాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అధికారులకు సమాచారం ఇచ్చిన వెంటనే పునరుద్ధారణ పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

అడవిపంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-జన్నారం

అడవి పంది దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రోటిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. రోటిగూడ గ్రామానికి చెందిన రైతు సిలివేరి రవి ఆదివారం తన పంట పొలంలో పంటకు నీరు పెడుతుండగా, అడవిపంది కొరకడంతో అతని కాలుకి తీవ్ర గాయాలయ్యాయి. వారి కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి ప్రాణాలను కాపాడారు. అటవీ శాఖ అధికారులు స్పందించి అతనికి నష్టపరిహారం ఇవ్వాలని వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

31న కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ, ఈ నెల 31న కలెక్టరేట్ ఎదుట ధర్నాను, ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడి చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవనంలో ఎమ్మార్పీఎస్ కోకన్వీనర్ గైక్వాడ్ సూర్యకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై మొదటి నుంచి బీజేపీ మద్దతుగా ఉండి ప్రస్తుతం నిర్లక్ష్యం వహిస్తూ, బిల్లును పార్లమెంట్‌లోకి తీసుకురాకుండా మాదిగలను మోసం చేస్తోందని ఆరోపించారు. రాబో యే రోజుల్లో మాదిగల నుండి బీజేపీకి వ్యతిరేకత తప్పదని అన్నారు. ఈ నేపథ్యంలో 31న కలెక్టరేట్ నిర్వహించే ధర్నాను, ఏప్రిల్ 4న చేపట్టే హైదరాబాద్ ముట్టడిని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సుద్దాల గంగన్న, నాయకులు బరుకుంట సుభాష్, ఈరగొల్ల శ్రీహరి, అడిగ స్వామి, కాంబ్లే పరమేశ్వర్, అరెపల్లి రాజేష్, సుంకే అనిల్, సూర్యవంశీ దేవరాజు, దర్శనాల దయానంద్, ఎంఎస్ఎఫ్ జిల్లా కోకన్వీనర్ పసుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

గుడిహత్నూర్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాస్



నవతెలంగాణ-గుడిహత్నూర్

గుడిహత్నూర్ మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా గన్నోజి శ్రీనివాస్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా బండారి రవీందర్, గౌరవ సలహాదారుగా సిద్ధార్థ రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా కొండా ప్రశాంత్, కోశాధికారిగా రంగు అశోక్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా మురళీధర్ ముండే, కార్యవర్గ సభ్యులుగా చట్ల దశరథ్‌రెడ్డి, ముస్కు విజయ్‌రెడ్డి, నిమిషకవి శ్రీనివాస్, సత్యనారాయణ, మీర్జా ముసా బేగ్, కోల నగేష్, మహమూద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కౌటాల

మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రె పుండలీక్ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. అన్నివిదాల అండగా ఉంటానని అధైర్యపడవద్దని కుటుంబ సభ్యులు ధైర్యం చెప్పారు. ఆయన వెంట ఎంపీపీ బసర్కర్ విశ్వనాథ్, బీఆర్ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్ ఉన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో మండల బీజేపీ నాయకులను పోలీస్‌లు ముందస్తుగా అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అక్రమ అరెస్టులు చేయడం సరికాదని బీజేపీ నాయకులు వాపోయారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని బీజేపీ నాయకులు అన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని కలమడుగు గ్రామంలో, నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కావడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారి ఆర్థిక పురోగాభివృద్ధికి తోడ్పాటును అందిస్తోందన్నారు. పేదింటి ఆడపాచుల కోసం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వద్దాప్య, వతంతు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు పింఛన్‌లు అందిస్తున్నామన్నారు. రైతుల కోసం రైతు బీమా రైతు బంధు పథకాలను ప్రవేశపెట్టామన్నారు. రైతులకు రైతు వేదికల గ్రామ గ్రామన నిర్మించామన్నారు. ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు డంపింగ్ యార్డు స్మశాన వాటికలు నిర్మించామన్నారు. వృద్ధుల కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్తును అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో రోడ్లు సక్రమంగా లేక రోడ్లపై నాట్లు వేసి నిరసన తెలిపే పరిస్థితుల నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను నిర్మించామని గుర్తు చేశారు. తాండాలను, గూడాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేసి గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేస్తున్నామని అన్నారు. మహిళల అర్థికాభివృద్ధితో పాటు వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు గర్భిణి, బాలింతలకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు మునావరలీ ఖాన్, జిల్లా అధికార ప్రతినిధి సీటిమాల భరత్ కుమార్, స్థానిక సర్పంచ్ యాదగిరి కార్తికరావు ఎంపీటీసీ యాదగిరి, స్వరూపారాణి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రియాజుద్దీన్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, శ్రీపతి బుచ్చన్న, మండల అధ్యక్షుడు జాడిశంకర్, బండ దేవేందర్, మండల ఉపాధ్యక్షులు జంగం సంతోష్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ప్రజలే కాపాడాలి

- సీఎల్పీ నేత బట్టి విక్రమార్క



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం ప్రజాస్వామ్యం భయానక పరిస్థితుల్లో ఉందని దానిని కాపాడే దిశగా ప్రజలు కదలాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. 'హాత్ సే హాత్ జోడోయాత్ర'లో భాగంగా మండలంలోని బూరుగూడ వద్ద ఏర్పాటుచేసిన విశ్రాంత కేంద్రంలో సంకల్ప దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం కూని చేయబడుతుందన్నారు. దేశ సంపద దోపిడీ చేస్తున్నారని దీనికి ఆదానికి ప్రధాని సహకరిస్తున్నారని హిడెన్ బర్గ్ నివేదిక తెలిపినప్పటికీ దానిని బీజేపీ ప్రభుత్వ కప్పిపుచ్చే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. నవభారత నిర్మాణంలో జోడోయాత్ర ఒక చరిత్ర అన్నారు. జోడోయాత్రతో బీజేపీలో ఒక భయాన్ని రాహుల్ గాంధీ సృష్టించారన్నారు. దీనిని భరించలేకనే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఇదంతా చూస్తున్నారని లౌకిక వాదాన్ని ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న బీజేపీకి సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఎంతో చరిత్ర గల పార్టీకి అధ్యక్షునిగా వ్యవహరించిన వ్యక్తిని బహిష్కరించడం చరిత్రలో దుర్దినమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఏఐసీసీ ఆధ్వర్యంలో ఢిల్లీలో, పీసీసీ ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో సంకల్ప దీక్ష నిర్వహిస్తున్నారని దానికి మద్దతుగా పాదయాత్రలో సంకల్ప దీక్ష చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ బీజేపీపై పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, జిల్లా నాయకులు రావి శ్రీనివాస్, మరుసుకోల సరస్వతి, కృష్ణారెడ్డి, రాథోడ్ గణేష్, అనిల్ గౌడ్, వసంతరావు, శ్రీనివాస్, మంచిర్యాల నాయకురాలు శాలిని, చిలుముల శంకర్, కళావతి పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-జన్నారం

మండలంలో సెర్ప్ ఉద్యోగులకు(ఐకేపీ) పే స్కేల్ వర్తింపజేస్తూ జీఓ నెం.11 విడుదల చేసిన సందర్భంగా మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే, రేఖా నాయక్ ఐకేపీ ఉద్యోగులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల మహిళా సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను విడుదల చేసిన సందర్భంగా మండలానికి 2018-19, 2019-20 సంవత్సరానికి 964 సంఘాలకు మొత్తం రూ.1.69 కోట్ల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాజారాం రెడ్డి, జనార్దన్, వైస్ ఎంపీపీ సుతారి వినయ్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి పద్మ-బుచ్చన్న, జన్నారం సర్పంచ్ గంగాధర్‌గౌడ్, ఎంపీటీసీ రియాజుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ శీలం రమేష్, కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్, స్థానిక నాయకులు భరత్, వెంకటేష్ పాల్గొన్నారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని పార్‌పెల్లి గ్రామానికి చెందిన సంగ భీమేష్ (22) యువకుడు ఆదివారం గోదావరి నదిలో స్నానానికి వెళ్లి మృతి చెందాడు. స్థానిక ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు ఉదయం తన పంట చేనులో పురుగుమందు పిచికారీ చేసిన అనంతరం గోదావరి నదిలో స్నానానికి వెళ్లి ప్రమాదశవత్తు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ అధ్యక్షుడిగా దుటా రాజేశ్వర్



నవతెలంగాణ-ఉట్నూర్

కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ అధ్యక్షుడుగా మండలంలోని గంగన్నపేట్‌కు చెందిన దూట రాజేశ్వర్‌ని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు సాజిత్‌ఖాన్ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు దూట రాజేశ్వర్ ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సాజిత్‌ఖాన్‌ని కలిసి సన్మానించారు. తనపై నమ్మకంతో పదవిని కట్టబెట్టినందుకు అందరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయాంలో చేపట్టిన ప్రభుత్వ పథకాలు, తెలంగాణ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు.

గ్రామం నుంచి సర్వీస్ రోడ్డు వద్దు

నవతెలంగాణ-గుడిహత్నూర్



మండల కేంద్రం గుండా వెళ్తున్న జాతీయ రహదారి అనుకుని పాత రోడ్డును సర్వీసు రోడ్డుగా మార్చి వాహనాల రాక పోకలు సాగించడానికి వీలుగా నేషనల్ హైవే ఆఫీసర్లు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఆదివారం దీన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. పాత రోడ్డును సర్వీసు రోడ్డుగా మార్చొద్దని హైవే అధికారులకు గుడిహత్నూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు హైవే అధికారులు రోడ్డు కాంట్రాక్టర్ నాగరాజ్‌తో చర్చలు జరిపారు. అయితే గ్రామస్తులు మాత్రం గ్రామం గుండా వెళ్తున్న రోడ్డును సర్వీసు రోడ్డుగా మార్చడం వల్ల సమస్యలు ఎదురవుతాయని ప్లాన్‌ను మార్చుకోవాలని కోరారు. అయితే ఈ ప్రతిపాదనను తమ పై అధికారులకు నివేదిస్తామని హైవే అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సర్పంచ్ జాదవ్ సునీతా రమేష్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, ఎంపీటీసీ అంకలి సవితా రవీందర్, పీఏసీఎస్ చైర్మెన్ సంజీవ్ ముండే, కోఆప్షన్ సభ్యుడు జమీర్, గ్రామ పెద్దలు మాధవ్ కేంద్రే, వామన్ గిత్తే, నాగ్‌నాథ్ అప్పా, శ్రీరాం లాందాడే, సంభాజీ చాటే, లక్ష్మణ్ కేంద్రే, రావణ్ ముండే, వినోద్ కొల్లూరి, కరుణాకర్ ఉన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తూ, అన్ని రంగాల్లో రాణించాలని న్యాయమూర్తి ప్రమీల జెన్ సూచించారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో డీఎల్‌ఎస్‌ఎ ఆధ్వర్యంలో దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక సదస్సును నిర్వహించారు. ఇందులో వైద్య నిపుణులు దివ్యాంగులను పరిక్షించి, వారికి ఏ రకమైన ఉపకరణాలు అవసరమవుతాయని గుర్తించారు. త్వరలో ఆ ఉపకరణాలు బాధితులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి క్షమా దేశ్ పాండే, లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ముఖ్య న్యాయవాది దాసరి గంగారాం, ఉపన్యాయవాది అశోక్, సహాయ న్యాయవాది ఉమేష్ డోలే, న్యాయవాది వెండి భద్రీశ్వరరావు, ప్రముఖ వైద్యులు అనిల్ చిత్రాల, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బీఎంఎస్ వైద్యులకు అభినందనలు

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ గట్టు శ్రీకర్ జనరల్ మెడిసిన్ (ఎండి) ఆధ్వర్యంలో 10 మంది ఆయుర్వేదం బీఎంఎస్ వైద్యులు అల్లోపథిక్ (బ్రిడ్జ్) కోర్స్‌ను నవంబర్ 2022 నుండి మార్చి 2023 వరకు నాల్గు నెలలపాటు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గట్టు శ్రీకర్ యువ వైద్యులను అభినందించారు. వైద్య సదుపాయాలు లేని గ్రామాలలో ప్రజలకు మిడిల్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లుగా(ఎంఎల్‌హెచ్‌పీ) వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో యువ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలర్ల గైర్హాజరుపై అనుమానాలు..!

- బడ్జెట్ సమావేశాలకు డుమ్మా కొడుతున్న కౌన్సిలర్లు
- అవిశ్వాసానికి ప్రయత్నాలు

నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ఖానాపూర్ మున్సిపాలిటీలో అసలు ఏం జరుగుతోంది. ఒక పక్క మున్సిపల్ కౌన్సిలర్ల గైర్హాజరు మరో పక్క బడ్జెట్ ప్రణాళిక సమావేశాలు వాయిదా.. ఇదంతా చూస్తుంటే అవిశ్వాసమేనని రాజకీయ విశ్లేషకులకు, మేధావులకు, ప్రజలకు బిన్న అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ మేజర్ గ్రామపంచాయతీ నుంచి అభివృద్ధి దిశగా మున్సిపాలిటీగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. దీంతో పట్టణం అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందని, ఆ దిశగా ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ, అభివృద్ధి పనులు చేపడుతుందని అధికార పార్టీ నాయకులు పలు సందర్భాల్లో, సమావేశాల్లో మున్సిపల్ అభివృద్ధిపై ప్రసంగాలు చేశారు. మున్సిపల్ అభివృద్ధికి పాటు పడాల్సిన కౌన్సిలర్లు ప్రతి యేడు నిర్వహించే బడ్జెట్ ప్రణాళిక సమాశాలకు గైర్హాజరవుతున్నారు. దీంతో ఈ సమావేశాన్ని కోరంలేక వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ప్రకటిస్తున్నారు. తరువాత తేదిలు ప్రకటించినప్పటికీ ఆ తేదిల్లో నిర్వహించే సమావేశానికి సైతం కౌన్సిలర్లు డుమ్మాకొడుతున్నారు. దీంతో అక్కడి ప్రజల్లో కౌన్సిలర్ల గైర్హాజరుపై చర్చ కొనసాగుతోంది. మున్సిపల్ అభివృద్ధి కోసం నిర్వహించే సమావేశాలు సభ్యుల గైర్హాజర్‌తో నిర్వహించలేని వారు మున్సిపాలిటీని ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

బడ్జెట్ ప్రణాళిక సమావేశాలకు డుమ్మాకొడుతున్న కౌన్సిలర్లు...

ఖానాపూర్ మున్సిపాలిటీలో మొత్తం 12 మున్సిపల్ స్థానాలు ఉన్నాయి. వాటికి ఎన్నికలు నిర్వహించగా 7గురు మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉండటంతో చైర్మెన్ పదవిని బీఆర్‌ఎస్ నాయకులు అంకం రాజేందర్ దక్కించుకున్నారు. అంకం రాజేందర్ పాలకవర్గం మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తోంది. కాని బారీ మేజార్టీ లేకపోవడంతో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అవిశ్వాసానికి ప్రయత్నం చేస్తున్నట్టున్న సమాచారం. అందుకే కౌన్సిలర్లు తరుచూ బడ్జెట్ సమావేశాలకు గైర్హాజరవుతున్నట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





అవిశ్వాసం తప్పదేమో...

ఖానాపూర్ మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 9, 18, 21 తేదీల్లో నిర్వహించ తలపెట్టి వాయిదా వేసిన సంగతి ప్రజలకు విధితమే. 9వ తేదీ మొదటి వార్డు కౌన్సిలర్ కావలి సంతోష్ సోదరుడు అకాల మరణం చెందడంతో వాయిదా వేసినప్పటికీ, మిగతా రెండు తేదీలు మాత్రం సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడ్డవే. కాగా మొదటి సమావేశానికి మున్సిపల్ పరిధిలోని 12 మంది కౌన్సిలర్లకు గాను ఐదుగురు కౌన్సిలర్లే నోటీసులు తీసుకున్నారు. అలాగే 18వ తేదీ నిర్వహించాల్సిన సమావేశానికి సంబంధించి 12 మంది కౌన్సిలర్ల నుండి నలుగురు మాత్రమే నోటీసులు తీసుకున్నారు. చివరిదైన 21వ తేదీన నిర్వహించాల్సిన సమావేశానికి ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే నోటీసులు తీసుకోవడం చూస్తుంటే ఖానాపూర్ మున్సిపాలిటీ చైర్మెన్ పదవికి అవిశ్వాసం తప్పదేమోనన్నట్టు స్పష్టమవుతోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

కోరం లేకనే సమావేశాలు వాయిదా..

చిట్యాల రత్నాకర్ రావు
మున్సిపల్ కమిషనర్



కోరం లేకపోవడం వల్లనే సమావేశాలు నిర్వహించలేకపోతున్నాం. ఈనెల 9వ తేదీన నిర్వహించాల్సిన మున్సిపల్ బడ్జెట్ సమావేశాలు స్థానిక ఒకటవ కౌన్సిలర్ కావలి సంతోష్ సోదరుడు అకాల మరణం చెందడంతో వాయిదా వేశాం. అలాగే ఈనెల 18, 21 తేదీల్లో నిర్వహించాల్సిన బడ్జెట్ సమావేశాలకు సభ్యులు హాజరుకాక, కోరం లేకపోవడంతో వాయిదా వేశాం. బడ్జెట్ సమావేశాల వాయిదాలకు సంబంధించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేశాం.

క్రీడలకు అధిక ప్రాధాన్యత

- మంత్రి అల్లోలో ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కిక్ బాక్సింగ్ ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందని, రోజూ బాక్సింగ్ ట్రైనింగ్ చేయటంతో శారీరక దారుఢ్యం, మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. రోజూ మంచి పోషక ఆహారం తీసుకోవడంతో ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. నేటి ప్రపంచంలో చదువుతో పాటు ఆటలు చాలా అవసరం అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, తెలంగాణకు చెందిన నికత్ జరీన్ ప్రపంచ స్థాయి బాక్సింగ్ క్రీడాకారిణిగా ఎదిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో మంత్రి కిక్ బాక్సింగ్ ప్రాక్టీసు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, కిక్ బాక్సింగ్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

చరవాణిలో అసభ్యకరంగా సందేశం పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రధానమంత్రి మోడీని దొంగని దూషించే విధంగా సోషల్ మీడియాలో సందేశం పెట్టిన వ్యక్తిపై బీజేపీ నాయకులు ఆదివారం దిలావర్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలం జౌలి గ్రామానికి చెందిన బంగ్లా దయాకర్‌రెడ్డి అనే వ్యక్తి ప్రధాన మంత్రి మోడీపై అనుచిత వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పొందుపరిచాడని అందుకు నిరసనగా బీజేపీ మండల అధ్యక్షుడు పిసారి శైలేశ్వర్ ఆధ్వర్యంలో దిలావర్‌పూర్ మండల పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో బీజేపీ పార్టీపై గానీ, నాయకులపై గానీ అనుచిత వ్యాఖ్యాలు చేసినా, సామజిక మధ్యమంలో సందేశాలు పొందుపరిచినా సహించేది లేదని హెచ్చరించారు. మోడీ ఆదర్శప్రాయమైన పాలన చూసి ఓర్వలేక ఇలాంటి పనులకు ఒడిగడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోడె ముత్యం, బీజేవైఎం నిర్మల్ జిల్లా ఐటీ సోషల్ మీడియా కన్వీనర్ రాథోడ్ సందీప్, నాయకులు కదం రమేష్, దన్నూర్ సాయరెడ్డి, సాయిరాం, ముత్యం, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసుల ఆరాధ్య దైవం ఇంద్రాదేవికి పూజలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఆదివాసుల ఆరాధ్య దైవం ఇంద్రాదేవికి ఆదివారం తుడుం దెబ్బ నాయకులు ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఇంద్రాదేవి గోండి పాటను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షులు గోడం రేణుక, ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, ఉపాధ్యక్షులు ఉయిక ఇంద్రబాయి, తుడుం దెబ్బ ఉపాధ్యక్షులు వెట్టి మనోజ్, కోరేంగా యశ్వంత్ మహారాజ్, ఇంద్రవెల్లి మండల తుడుం దెబ్బ అధ్యక్షులు జుగ్నక్ భరత్, విద్యార్థి సంఘం మండల అధ్యక్షులు పుర్క చిత్రు, ఉపాధ్యక్షులు గేడం భరత్, వారితో పాటు తుడుం దెబ్బ గౌరవ అధ్యక్షులు అర్క ఖమ్ము, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రామ్‌దాస్, సేడ్మాకి సీతారాం, రాహుల్ మెస్రం దినేష్ పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్తసాయి మందిరం ఆవరణలో నూతనంగా నిర్మించనున్న గో మందిరం, గోశాల నిర్మాణానికి ఆదివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గండి రామన్న ఆలయ ప్రాంతం అంతా ఆధ్యాత్మికంగా తయారవుతుందన్నారు. గోవును పూజించినంత పుణ్యం ఎక్కడ లేదని, మన పురాతన కాలం నుండి ఉందని అన్నారు. ఈ గోశాలను లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి సోదరులు తమ సొంత నిధులతో నిర్మించడం అభినందనీయమని అన్నారు. ఆధ్యాత్మికత, ఆలయాభివృద్ధి కోసం దాతలు ముందుకు రావాలని అన్నారు. గండి రామన్న ఆలయాన్ని రూ. 2 కోట్ల 25 లక్షల దేవాదాయ శాఖ నిధులతో అత్యద్భుతంగా నిర్మించనున్నట్లు వెల్లడించారు. నంది గుండం దుర్గామాత, కాళీ మాత, శుక్రవారం దేవత, రాజస్తానీయుల కోసం రాందేవ్ బాబా ఆలయం, ఇలా అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఈ ప్రాంతంలో టూరిజం ప్లాజా హోటల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహలక్ష్మీ ఆలయాన్ని రూ.4కోట్లతో అద్భుతంగా నిర్మించామని అన్నారు. రూ.100 కోట్లతో బాసర ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, ప్రముఖ కాంట్రాక్టర్ లక్కడి జగన్‌మోహన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, దేవర కోట చైర్మెన్ లక్ష్మీ నారాయణ, కాళేశ్వరం ఆలయ డైరెక్టర్ కొరిపెల్లి దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ లు పోశెట్టి, ఆమెడ శ్రీధర్, కత్తి సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పట్టణంలోని 20వ వార్డు పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో ఆదివారం రూ.55లక్షలతో వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జోగు రామన్న భూమిపూజ చేశారు. స్థానికులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం లబ్ధిదారులకు ఆసరా పెన్షన్ గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. మహిళల ఆత్మ గౌరవాన్ని రెట్టింపు చేసేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. గతంలో నిరాదరణకు గురైన ప్రాంతాలలో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడుతూ ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు సంజయ్, పందిరి భూమన్న, అశోక్ స్వామి, రాజు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో శ్రీకృష్ణ యాదవ సంఘ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షులు బత్తిరీ ప్రసాద్ తెలిపారు. గౌరవ అధ్యక్షులుగా జిడ్డు పోతన్న యాదవ్, ఉపాధ్యక్షులుగా జిడ్డు నవీన్ యాదవ్, కోశాధికారిగా ముల్కి సురేష్ యాదవ్, సంయుక్త కార్యదర్శిగా జిడ్డు ప్రమోద్ యదవ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

శ్రీ కృష్ణ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యేకు వినతి...

శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు ఆదివారం దేగామలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే సత్కరించారు. బాసరలో శ్రీకృష్ణ భవన నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణానికి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, మల్కన్నా యాదవ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల కోలాహలం



నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి ఆలయంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. పంచమి శుభ ముహూర్తం ఉండటంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి నది తీరంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారి అక్షరాభ్యాస దర్శన క్యూ లైన్లలో బారులు తీరారు. భక్తులు ఆలయంలోని అక్షరాభ్యాస మండపాలలో అక్షరాభ్యాస పూజలను ఆలయ అర్చకులచే జరిపించారు. భక్తులు ఆలయంలోని అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన సత్రంలో అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం

- తొమ్మిదేండ్లలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు
- బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతోందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీ లక్ష్యమని అన్నారు. రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్లు, ఉచిత చేప పిల్లలు, సబ్సిడీ గొర్రెల పంపిణీ, గిరి వికాసం, దళితబంధు, దళిత బస్తీ, మిషన్ భగీరథ, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు లాంటి సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు దూసుకెళుతోందని అన్నారు. మునుపెన్నడు లేని విధంగా మండలంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులు ప్రతిపక్ష పార్టీలకు కనపడకపోతే కంటి వెలుగు శిబిరానికి వెళ్లి కంటి పరీక్షలు చేసుకోవాలని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజా మద్దతుతో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. దళిత వర్గాల అభ్యున్నతికి దళితబంధు పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఎవరైనా దళితబంధు కోసం డబ్బులు అడిగితే తనకు ఫోన్ చేసి తెలుపాలని అన్నారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, గౌతమ్‌రెడ్డి, జెడ్పీ చైర్మెన్ కోరిపెల్లి విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు వెంకట్ రామ్‌రెడ్డి, నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎర్రవోతు రాజేందర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీగారి రాజేందర్, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, శాతం గంగారాం, రాంరెడ్డి, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఆదివారం హెల్ప్ వీల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీ పార్లర్ శిక్షణను పొందిన 20మంది విద్యార్థులకు సర్టిఫికేట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకు వెళ్తున్నారని పేర్కొన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ మంచి ఉన్నత చదువులు చదవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఏజెన్సీ ప్రాంత యువతి, యువకులకు స్వయం ఉపాధిని అందించేందుకు హెల్ప్ వీల్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం తరుపున తమవంతు సహయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ వీల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అతిశ్ కాంబ్లే, భాస్కర్ బలిరావు, జీవ వైవిధ్య కమిటీ సభ్యులు మర్సుకోల తిరుపతి, మాజీ ఎంపీపీ కనక తుకారాం, మాజీ ఎంపీటీసీ భవాలే సత్యానంద్, బీఆర్‌ఎస్ నాయకుడు దావుల రమేష్, ఫౌండేషన్ సభ్యులు బామ్నే బాబా, ఆచార్య దత్త పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ సరుకులు పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలు కూడా పండుగలను ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి సరకులను పంపిణీ చేయడం అభినందనీయమని ఆదిలాబాద్ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ అన్నారు. దారుల్ అన్సార్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని పేదలకు నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. సెంట్రల్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సరకులను పంపిణీ చేశారు. నీతి నిజాయితీతో జీవిస్తూ దైవభక్తి కలిగి ఉండాలని సూచించారు. ఉపవాస దీక్షలు చేసే వారు ఈ సరుకులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ మంజూర్ అహ్మద్, సొసైటీ అధ్యక్షుడు ఖాజీ నదీమొద్దీన్, ఉపాధ్యక్షుడు హఫిజ్ అరిఫ్ ఖాన్, ఖిజర్ యాఫై, అతఉల్లా ఖాన్, అజ్జు హుస్సేన్, అస్మత్ అలీ, అమీమ్ షరీఫ్, షేక్ మోయిజ్ పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 27 మార్చి 2023

28, 29న వాలీబాల్ క్రీడా పోటీలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 28, 29వ తేదీన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంటును నిర్వహిస్తున్నట్టు ఎస్సై విజయ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. .

కౌటాలలో భారీ వర్షం

నవతెలంగాణ-కౌటాల

కౌటాల మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కరువడంతో మొక్క జొన్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షానికి నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలోని దేగామ గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం... దేగామ గ్రామానికి చెందిన కడ్తరపు రమేష్(33) ఇచ్చోడలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో బాధపడుతూ ఆదివారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి బార్య ఉంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే దివాకర్‌రావు



నవతెలంగాణ-లక్సెట్టిపేట్

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఆదివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణ్‌రావు ఆదేశాల మేరకు మహిళ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో కార్యచరణ, సంక్షేమ పథకాల అమలుపై మహిళలకు ప్రాధాన్యత, సూచనలు, సలహాలు అందజేశారు. మహిళ ఓటర్లకు ప్రభుత్వం చేస్తున్నఅభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షుణ్ణంగా వివరించాలన్నారు. ప్రతి ఓటును కూడా సద్వినియోగం అయ్యేలా చూడాలని దిశ నిర్దేశం చేశారు. ఐక్యతతో మెలిగి వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాస్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాదం శ్రీనివాస్, కౌన్సిలర్లు సురేష్ నాయక్, మెట్టు కల్యాణి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లక్ష సాదనకు ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలి

నవతెలంగాణ-కాసిపేట

రానున్న కాలంలో కాసిపేట-2 గనికి నిర్దేశించిన మూడు లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేదించేందుకు ఉద్యోగులు, అధికారులు కృషి చేయాలని సింగరేణి ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్ అధికారి వెంకటేశ్వర్ రెడ్డి చూచించారు. ఆదివారం మందమర్రి ఏరియా కాసిపేట-2 గనిపై వెంటిలేషన్ మెకానికల్ ఫ్యాన్ 300 హెచ్‌పీ 200 హెచ్‌పీ ప్రారంభించి మాట్లాడారు. కాసిపేట-2 గనిపై ఈ వెంటిలేషన్ ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని గనిలో పనిచేస్తున్న ఉద్యోగులకు మంచి గాలిని అందించేందుకు ఈ ఫ్యాన్ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం గని ఉత్తమ కార్మికులకు బహుమతులు అందజేసి గని ఆవరణలోమొక్కలు నాటారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం జాన్ ఆనంద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ధాగం మల్లేష్, టీబీజీకేఎస్ నాయకులు ఓ రాజశేఖర్, అధికారుల సంఘం ప్రతినిధి రాజన్న, గని మేనేజర్ రవీందర్, కాసిపేట ఏజెంట్ రాజేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధే పరమావదిగా ముందుకు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అభివృద్ధే పరమావధిగా తెలంగాణ ప్రభుత్వం ముందకు వెళుతుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఖోజాకాలనీకి చెందిన ముస్కు రత్నకిషోర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే జోగు రామన్న సమక్షంలో పార్టీ కండువా కప్పుకొని చేరారు. అనంతరం టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించిన వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభ ఎమ్మెల్యే పాల్గొన్నారు. రాము ఆధ్వర్యంలో యువకులు బీఆర్ఎస్ పార్టీలో కండువా కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధే పరమావధిగా తాము ముందుకు సాగుతున్నామని అన్నారు. కడుపులో ఉన్న బిడ్డ నుండి వృద్ధుల వరకు వారి సంరక్షణ కోసం సీఎం కేసీఆర్ అనేక బృహత్ పథకాలకు శ్రీకారం చుట్టారని అన్నారు. విద్య వైద్యం వంటి రంగాలకు విశేష ప్రాధాన్యతను ఇస్తూ ప్రజా సమస్యలను దూరం చేస్తున్నామని పేర్కొన్నారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని, వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు డాక్టర్ లక్ష్మణ్, పవన్ నాయక్, భరత్, అశోక్ స్వామి, నాయకులు ధమ్మపాల్, శివకుమార్, ప్రశాంత్, గీత పాల్గొన్నారు.

యువత భక్తి మార్గాన్ని అనుసరించాలి

నవతెలంగాణ-బేల

యువత చెడు మార్గం పట్టకుండా భక్తి మార్గాన్ని అనుసరించాలని బీజేపీ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో ఆదివారం జరిగిన పూలాజీ బాబా ధ్యానమందిర వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై భక్తులనుద్దేశించి మాట్లాడారు. భగవంతుని ధ్యానానికి మించిన మోక్షం లేదని అన్నారు. తల్లి దండ్రులను మించిన దైవంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినక పుష్పలత సుధాంరెడ్డి, ఎంపీటీసీ మినక నగేష్‌రెడ్డి, బాబా భక్తులు సతీష్ గుర్నూలే, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

దళిత బందు మంజూరు చేయాలని వినతి

ఆసిఫాబాద్ : తనకు దళిత బంధు మంజూరు చేయాలని వాంకిడి మండలం సరండి గ్రామానికి చెందిన సురేష్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావుకి ఆదివారం వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకం తనకు వర్తింప చేయాలని కోరారు. పేదరికంలో ఉన్నానని ఒకవేళ దళిత బందు రాకుంటే గృహలక్ష్మి కింద రూ.మూడు లక్షలు మంజూరు చేసేలా చూడాలని కోరారు. జడ్పీటీసీ స్పందిస్తూ గృహలక్ష్మి పథకం మంజూరు చేసేలా చూస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్, సరండి ఎస్సీ కాలనీ అధ్యక్షుడు రవీందర్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ జిల్లా కమిటీ మెంబర్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు

పాదయాత్ర పాట సీడీ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ : సీఎల్పీ నేత బట్టి విక్రమార్క చేపట్టిన 'హాత్ సే హాత్ జోడోయాత్ర' కు సంబంధించి పాటను పీసీసీ సభ్యుడు సిర్పూర్(టి) నియోజకవర్గ నాయకుడు కోరళ్ళ కృష్ణారెడ్డి రాయగా మేడి వరప్రసాద్ పాడిన 'బట్టిన్న దారిలో బట్టిన్న దారిలో' పాట సీడీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

మైనార్టీలకు రుణపంపిణీలో సందిగ్ధం

- మండలానికి రెండు యూనిట్‌లే కేటాయింపు
- 130 మంది అభ్యర్థులు దరఖాస్తు
- అందరికీ రుణాలివ్వాలని విజ్ఞప్తి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ రాష్ట్రంలో కలలు సాకారం చేసుకోవచ్చని నిరుద్యోగ యువత ఎంతో ఆశ పడ్డారు. కానీ రాష్ట్రం ఏర్పడ్డాక ఆశలన్నీ అడియాశలయ్యాయి. ఉద్యోగం దొరకకపోయినా కనీసం కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొంది స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవచ్చని భావించారు. అయినా ప్రభుత్వం ఆ దిశగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. ముస్లిం మైనార్టీ సంక్షేమం కోసం ఎన్నో చేస్తున్నామని చెప్పుకుంటున్నా ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇవ్వడానికి అరకొర యూనిట్లు కేటాయించింది. సబ్సిడీ రుణాలకు ప్రభుత్వం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మైనార్టీ కార్పొరేషన్ నుండి రుణాలు పొందాలని ఎన్నో ఏండ్ల నుండి ఆశతో ఉన్న ముస్లిం మైనార్టీలు దరఖాస్తు చేసుకున్నారు. రూ.లక్ష రుణానికి 80 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుండగా 20 శాతం బ్యాంకులు లేదా స్వతహాగా చెల్లించుకునే వెసులుబాటు కల్పించారు. రూ.2 లక్షల రుణానికి 70 శాతం సబ్సిడీ మిగతా 30 శాతం బ్యాంకుకు సంబంధం లేకుండా కార్పొరేషన్‌కు చెల్లిస్తే రూ.లక్ష, రూ.2 లక్షల చెక్కును అందజేయనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా యూనిట్ల కేటాయింపు పట్ల లబ్దిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండలానికి రెండు యూనిట్లు మాత్రమే కేటాయించడంతో మిగిలిన వారు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

యూనిట్ల కేటాయింపులో గందరగోళం

మండలంలో ముస్లిం మైనార్టీ జనాభా సుమారు 1500 వరకు ఉంది. ప్రభుత్వం మైనార్టీ రుణాల ప్రకటన జారీ చేయగా 130 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మాత్రం రెండు యూనిట్లు మాత్రమ కేటాయించింది. లబ్దిదారుల ఎంపిక కోసం ఎంపీడీఓ ఫిబ్రవరి నెలలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. జనాభా ప్రాతిపదికన రెండు యూనిట్లు కేటాయించడం అన్యాయమని, యూనిట్లు పెంచాలని మైనార్టీలు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లిన త్వరలో ఇంటర్వ్యూలు చేపడతామని హామీ ఇచ్చారు. అయినా ఇప్పటివరకు దీనిపై స్పందన కరువైందని మైనార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ రుణాలు ఇచ్చి న్యాయం చేసేలా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

ఉన్నత చదువులు చదవాలి

కబీర్ హైమద్



హిందీ పండిట్. పీజీ, బీఇడీ చదివాను. 15 ఏండ్లు విద్యావాలంటీర్‌గా పనిచేశాను. ప్రస్తుతం ప్రభుత్వం ఈ విద్యావాలంటరీ వ్యవస్థను తొలగించడంతో కుటుంబాన్ని పోషించుకోవడానికి ప్రతి శనివారం వారసంతలో కూరగాయలు అమ్ముకుంటున్నాను. ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వకున్నా ఫర్వాలేదు కానీ ఎంతోకొంత రుణ సదుపాయం కల్పిస్తే బాగుంటుంది.

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా

జమీల్, చిరువ్యాపారి



కుటుంబాన్ని పోషించుకోవడానికి చిన్న చికెన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాను. కుటుంబ పోషణకు సంపాదన సరిపోవడం లేదు. అన్ని సరుకుల ధరలు పెరిగాయి. పిల్లలు పెద్దవాళ్ల అవుతున్నారు. కుటుంబాన్ని పోషించడంతో పాటు వారిని చదివించాలంటే భారంగా ఉంది. ప్రభుత్వం స్పందించి రుణం అందిస్తే వ్యాపారాన్ని మరింత మెరుగుపరుచుకుంటాను.

త్వరలోనే లబ్దిదారుల ఎంపిక చేపడతాం

ఎం.రాజేశ్వర్, ఎంపీడీఓ

మైనార్టీ రుణాల కోసం గతంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా అదనంగా యూనిట్లు కేటాయించాలని అభ్యర్థులు నిరసన వ్యక్తం చేయగా సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. వారి ఆదేశాల మేరకు త్వరలోనే అభ్యర్థుల ఎంపిక చేపడుతాం.

'కాంగ్రెస్, బీజేపీలు ప్రమాదకరమైనవి'

- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ జిల్లా ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణ్‌రావు



నవతెలంగాణ-కాసిపేట

కాంగ్రెస్, బీజేపీ ప్రమాదకరమైన పార్టీలని మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ఇన్‌ఛార్జి నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కొండాపూర్ యాపలో 12 పంచాయతీల నాయకులతో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, దళారుల ప్రమేయం లేకుండా లబ్దిదారులకు నేరుగా సంక్షేమ పథకాలు ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్‌లు అదజేస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రము ఏర్పాటు కాకముందు కాంగ్రెస్ హయాంలో కరెంటుకు కటకటా, అభివృద్ధి లేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత రోడ్లు, విద్య, వైద్యం, తాగునీరు, సాగు నీరు, 24 గంటల కరెంట్, నూతన జిల్లాల ఏర్పాటుతో వేగంగా అభివృద్ధి జరిగిందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో సిలిండర్, డీజిల్, పెట్రోల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచి పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూన్నారని పేర్కొన్నారు. సింగరేణి, ఎల్‌ఐసీ, రైల్వే స్టేషన్లు, విమనశ్రేయాలు ప్రైవేటికరించేందుకు మోడీ ప్రభుత్వం కుట్రచేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్‌ను ఆదరిస్తేనే పేద ప్రజల అభ్యున్నతి సాధ్యమన్నారు. నియోజకవర్గానికి మొదటి సారి 3 వేల ఇండ్లు, రెండవ సారి 3 వేల ఇండ్లు మంజూరు అవుతాయని వీటిని అర్హులైన పేద ప్రజలకు అందేలా కృషిచేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, గ్రంథాలయా చైర్మన్ ప్రవీణ్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లు రమణారెడ్డి, ఎంపీపీ రొడ్డ లక్ష్మీ, వైస్ ఎంపీపీ విక్రమ్‌రావు, జడ్పీటీసీ చంద్రయ్య, సింగల్ విండో చర్మన్ నీల, రైతు సమితి అధ్యక్షుడు దుర్గం పాశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంజులరెడ్డి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీపై ఆనర్హత వేటును నిరసిస్తూ సత్యాగ్రహ దీక్ష



నవతెలంగాణ-హాజీపూర్

అక్రమ కేసులు బనాయించి జైలుపాలు చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్ర నిరసిస్తూ మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. శనివారం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు గాంధీపార్కులోని గాంధీ విగ్రహం ముందు ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ మాట్లాడుతూ భారత దేశ ప్రజాస్వామ్యం ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఆదాని, లలిత్‌మోడీ, నీరవ్ మోడీలు ఈ దేశ సంపదను దోపిడీ చేస్తుంటే సహకరిస్తున్న మోడీ సర్కార్‌ను ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ గొంతు నులిమేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే ఈ అనర్హత వేటు అని వారు అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన సూరత్‌లో రాహుల్ గాంధీపై అక్రమంగా కేసు పెట్టి, శిక్షపడేలా చేసి, పార్లమెంటు నుంచి అనర్హత వేటు వేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని అన్నారు. ఈ దేశ సంపద అయినా ఎయిర్ పోర్ట్‌లు, బొగ్గు గనులు, ప్రభుత్వ రంగ సంస్థలను ఆదానికి దారాదత్తం చేస్తున్న మోడీ విధానం కరెక్ట్ కాదని ప్రశ్నించడం రాహుల్ గాంధీ చేసిన నేరమా అని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఈ దేశ సంపద ఈ ప్రజలకే చెందాలని పాదయాత్ర చేసిన రాహుల్ వచ్చే ఎన్నికల్లో ప్రధాని అవుతాడన్న భయం మోడీ, అమిత్ షా లకు పట్టుకుందని అన్నారు. రాహుల్ గాంధీ కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లౌకికవాదులు, ప్రజాస్వామికవాదులు, రాజ్యాంగ ప్రేమికులు, దృఢమైన దీక్షతో పోరాటానికి కదం తొక్కాలని పిలుపునిచ్చారు.

మైసమ్మ దేవి విగ్రహ ప్రతిస్థాపన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల ప్రక్కన మున్నూరు కాపు సంఘం స్థలంలో ఆదివారం మైసమ్మ విగ్రహాన్ని ప్రతిష్టాపన చేశారు. వేద పండితులు సంతోష్ శర్మ, శేఖర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండి ఆలయంలో హోమం, ధ్వజ స్తంభం, ప్రత్యేక పూజలు చేసి మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలు మండలాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవి ఆశీర్వాదం తీసుకొని తీర్థ, ప్రసాదం స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. మండలంలోని సాలెగూడా గ్రామపంచాయతీ పరిధిలో భాగ్యనగర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం కేటాయించిన పనులు మార్చి చివరి నాటికల్లా పూర్తి చేయాలన్నారు. పనులపై ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని అన్నారు.



ఎప్రిల్ 5న మజ్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీ

- సీఐటీయు జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించే తలపెట్టిన చలో ఢిల్లీ మద్దూర్ కిసాన్ సంఘర్ష ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్-మతోన్మాద అనుకూల విధానాలను అమలు చేస్తుందని, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఏప్రిల్ 5 ఛలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్మిక హక్కులు, కార్మిక చట్టాల రక్షణ, 4 లేబర్ కోడ్స్ రద్దు, విద్యుత్ సవరణ బిల్లు-2022 ఉపసంహరణ, మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు, పని దినాలు 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ. 600 లుగా నిర్ణయించాలనే డిమాండ్లతో ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. ధరల పెరుగుదలను నియంత్రించడం, రైతులు పండించే అన్ని ఉత్పత్తులకు కనీస మద్దతు ధర నిర్ణయించి కొనుగోలుకు గ్యారంటీచేయాలని, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, వెలిశాల కృష్ణమాచారి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పట్టణ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేశాయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదేశించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టీచర్ కాలనీలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని 10 మండలాల 242 గ్రామ పంచాయతీలకు రూ.25 కోట్ల ఉపాధి హామీ నిధులు కేటాయించినట్లు తెలిపారు. నిధులతో సీసీ రోడ్స్ డ్రైనేజీల నిర్మాణ పనులను, ఆసిఫాబాద్ పట్టణ అభివృద్ధికి రూ.15కోట్ల ఎస్డిఎఫ్ నిధులతో పనులు చేపట్టామని తెలిపారు. జిల్లా కేంద్ర మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు నిషార్, హైమద్, బండి సాయి, అధికారులు పంచాయతీరాజ్ ఏఈ రామ్ కిరణ్ పాల్గొన్నారు.

నేడు అడెల్లి ఆలయం పున:నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహపోచమ్మ ఆలయ పునర్ నిర్మాణానికి సోమవారం దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి భూమిపూజ చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మెన్ ఆయిటి చందు, ఆలయం నిర్వహణ అధికారి రంగు రవి కిషన్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే మంగళవారం ఆలయ హుండీ లెక్కింపు ఉంటుందని వెల్లడించారు. సకాలంలో ఆలయ ధర్మకర్తలు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



నవతెలంగాణ-తలమడుగు

తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో సీఎం కేసీఆర్ తన ప్రాణాన్ని సైతం లెక్క చేయకుండా రాష్ట్రం సాధించేవరకు పోరాటం చేశారని అన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. కీర్తి ప్రతిష్టలు చిరస్థాయిలో ఉండే విధంగా మిషన్ భగీరథ, ఎత్తిపోతల పథకాలు రైతుబంధు, రైతుబీమా, రైతులకు ఉచిత విద్యుత్, వివిధ రకాల పింఛన్లు ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మూడో సారి కూడా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండి ఏ సమస్యలు వచ్చిన కుటుంబంలో చర్చించుకుందామని అన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్ కుమార్, ఝరి పీఏసీఎస్ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు ఆనంద్, రాంబాయి, కిష్టన్న, పోతారెడ్డి, మండల నాయకులు శ్రీనివాసరెడ్డి, తాటిపెల్లి సునీత, పల్లవి, సదాశివ్, ఆశన్న యాదవ్, మగ్గిడి ప్రకాష్, మేకల వెంకన్న, దేవరావు వివిధ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజ హితం కోరుతూ సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఆదివారం రిమ్స్ ఆడిటోరియంలో కిరాణ అండ్ జనరల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. వారికి పండ్ల రసాన్ని అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను శాలువా, పుష్పగుచ్ఛలతో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ కిరాణ దుకాణ సముదాయాల్లో పని చేస్తూ సేవలందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు సామజిక స్పృహతో సేవా కార్యక్రమాలు చేపట్టడం పట్ల అభినందనలు తెలిపారు. దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న గుమాస్తాల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, స్థలాల కేటాయింపులో అర్హులైన వారిని గుర్తించి, వారికి అండగా నిలబడతామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు గణేష్, ప్రధాన కార్యదర్శి జబాడే దాదాసాహెబ్ పాల్గొన్నారు.